కథ

# శోధన

జయంతి పాపారావు

"ఏం శోధనా! అంత మౌనం ఏంటి?!"

"ఏంలేదు, వదినా!"

"ఏంలేకపోవడమేంటి? ఏదో ఉంది!"

"ఏంలేదు, వదినా!"

"మేం ఎప్పుడు అమెరికానుంచి వచ్చినా ఎంతో హడావుడిగా నోరాపకుండా మాట్లాడుతూ ఉండే వాడివి! ఇప్పుడేంటి అంత మౌనం! ఇంత మార్పు ఇంతలోనే ఎలా వచ్చేసింది? ఆశ్చర్యంగా ఉంది!"

"నువ్ చెప్పింది నిజమే సరోజా! మా పెద్దబ్బాయి అన్వేషణ ఎప్పుడూ మౌనంగానే ఉంటాడు. అది వాడి స్వభావం. ఇద్దరొంతూ నోరాపకుండా వీడే మాట్లాడు తాడు. అది వీడి స్వభావం. ఎందుకో గానీ ఈ మధ్దిన వీడుకూడా పెద్దవాడి బాటలోనే పడ్డాడు!"

"అంత ఎక్కువగా మాట్లాడితే చెవులు మూసేసు కుని ఎవరూ వినరేమోనని భయపడ్డాడేమో!"

"అదేం కాదు! నా మాటలు వినడానికెవరూ చెవులు మూసేసుకోరు, చెవులు కోసేసుకుంటారు! అది నీకు తెలీదేమో!"

"అయితే, మీ అన్నయ్య నీకు అమెరికాలో ఉద్యోగం చూడలేదని కోపమా?!"

"కాదు కాదు! ఎంత మాత్రం కాదు! నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చింది. వెళ్ళనా, మాన్నా అని ఆలోచిస్తున్నాను. అంతే!"

"అమెరికాలో ఉద్యోగం కావాలని గెంతులేసే వాడివి! ఇప్పుడేమయ్యింది?!"

"ఏరా, శోధనా! ఆ విషయం మాకూడా చెప్పలేదు! ఏరా, ఎందుకు చెప్పలేదు?!"

"వెళ్ళనా, మాన్నా అని ఆలోచనలోపడ్డాను. చాలా విషయాలు ఆలోచించాలి కదా!"

"ఆలోచించాలనే ఆలోచన వచ్చింది! అది చాలా మంచి మార్పు. అమెరికాలో ఉద్యోగం రాగానే గెంతు లేసుకుంటూ పారిపోవాలనే ధోరణిలో మార్పు వచ్చిందన్నమాట! అంత ఆలోచన నీకెలా ఎక్కణ్ణుంచి వచ్చేసింది!?"

"చూడు వదినా! మన ప్రజాధనం నా చదువుకోసం లక్షలు లక్షలు ఖర్చుపెట్టింది! ఆ రుణాన్ని నేను తీర్చుకోవాలి కదా! ఆ డబ్బుతో నేను నేర్చుకున్న జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని నాదేశంలోనే, నా సమాజంకోసం, నా ప్రజల కోసం ఉపయోగించడం ద్వారానే నేను ఆ రుణాన్ని కొంతమేరకైనా తీర్చుకోగలను. అదే నా ఆలోచన!"

"అది కొత్త ఆలోచన కాదు! మీ అన్నయ్య కూడా అప్పట్లోనే అంటే పదేళ్ళ క్రితమే ఆవిధంగా ఆలోచించారు! అది వీలుపడలేదు!"

"ఏం? ఎందుకు వీలుపడలేదు?"

"ప్రజాధనం మీ అన్నయ్య చదువుకి ఖర్చుపెట్టింది. అది వాస్తవమే. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. సొంత ఊరుని, సొంత సమాజాన్నీ, సొంత ప్రజ లనీ, తలిదండ్రుల్నీ అందర్నీ వదిలేసి దూరంగా ఏ దేశమో వెళ్ళిపోవాలని నిజానికి ఎవరూ కోరుకోరు! ఇక్కడ ఉద్యోగం దొరకనప్పుడు, ఎక్కడో అక్కడ చూసుకుని పోవాలి కదా! ఎక్కడో అక్కడ బతకాలి కదా! చదువు ఎవరిస్థాయిలో వాళ్ళు బతుకు తెరువు కోసం చదువుతారు. అలాంటప్పుడు బతుకు తెరువే లక్ష్యంగా ఉంటుంది. వేట ప్రారంభిస్తాం. ఎక్కడ అవకాశం దొరి కితే అక్కడికి పోతాం! జరుగుతున్న వాస్తవం ఇదే!"

"మరి ప్రజాధనం మాటేంటి? నష్టపోవాల్సిందేనా? ఎక్కడికో అక్కడకు మన బాగుకోసం వెళ్ళిపోవాల్సిందేనా? ఏదో ద్రోహం చేస్తున్నట్లు మనసు పీకుతోంది!"

"శోధనా! నువ్వలా అనుకుంటున్నావ్! అది సరే! విదేశాలు వెళ్ళిపోతున్నవాళ్ళు మరోలా అనుకుంటున్నారు! మేం మా కుటుంబంకోసం, దేశం కోసం కూడా త్యాగం చేస్తున్నామంటున్నారు!

నువ్ ద్రోహమంటున్నావ్! వాళ్ళు త్యాగమంటున్నారు! అది నీకు తెలుసా?''

''త్యాగమా? అదెలా?''

''నువ్వుండు సరోజా! ఏరా, శోధనా, దానికి జవాబు నేను చెప్తాను. మీ అన్నయ్య చదువు ఎన్ని ఇబ్బందుల్లో జరిగిందో, ఎన్ని కష్టాల్లో జరిగిందో మాకు తెలుసు! నీ చదువు ఏ ఇబ్బందులూ లేకుండా ఎలా జరిగిందో మాకు తెలుసు, నీకు తెలుసు. అదెలా జరిగిందో నీకు తెలీదా?''

''తెలుసు''

''తెలిస్తే చెప్పు, దాన్నేమంటారు?''

''దాన్ని బాధ్యతంటారు!''

''నువ్వేమని అను, నాకభ్యంతరం లేదు! వాడు అమెరికావెళ్ళి సంపాదించి మనకి డబ్బు పంపించబట్టే, అది వీలుపడింది. అన్ని ఇబ్బందులకంటే, అన్ని కష్టాల కంటే, క్రూరమైన ఇబ్బందులూ, కష్టాలూ డబ్బు ఇబ్బందులూ, డబ్బు కష్టాలే! డబ్బుంటూ ఉంటే, ఇతర ఇబ్బందులూ కష్టాలూ ఏదో విధంగా తట్టుకుంటాం! డబ్బు ఇబ్బందులు మనకి లేకుండా చేశారు మీ అన్నయ్యా, వదినా! దాన్ని నేను మాత్రం త్యాగంగానే భావిస్తాను!''

''మన సంగతలా ఉంచు! ఎవరి బాగుకోసం వాళ్ళు కష్టపడ్డం చాలా మంచిదే! అది బాధ్యతాయుతమైందే! మనం దానివల్ల కాస్త కుదుటపడ్డా, ప్రజాధనానికి జరిగిన నష్టం మాటేంటి?''

''అది నాకు తెలీదు! మనింట్లో జరిగింది నేను చెప్పాను! ఇక్కడే ఉండిపోయి ఉద్యోగంలేకో లేదా ఏదో చిన్న ఉద్యోగంలోనే ఉండిపోతే ఏమయ్యేది? దానివల్ల ఏం ప్రయోజనం? ఎవరికి ప్రయోజనం? అంతా నష్టమే కదా! మన ఇబ్బందులూ కష్టాలూ తీవ్రమౌతాయే కానీ తగ్గవుకదా! నీ చదువు ఆగిపోయినా, ఆగిపోను కదా!''

''శోధనా! నువ్ ఆలోచిస్తున్న దిశలో ఆలోచించడం చాలా మంచిదే! అవసరం కూడా. ఏ సమస్యనైనా అన్ని వైపుల నుంచి పరిశీలించాలి. మన కుటుంబం కాస్త ఆర్థిక ఇబ్బందుల నుండి కోలుకుంది. అంటే ఏమిటి? మన భారం ప్రజాధనానికీ, సమాజానికీ కొంత మేరకైనా, ఆ మేరకైనా తగ్గినట్లే కదా! సమాజానికి తొలి సామూహిక నిర్మాణం కుటుంబం! దాని బాగు సమాజానికి బాగే కదా! నష్టం ఏమీ లేదు కదా! మనం ఇక్కడే పేదరికంలోనే ఉండిపోతే, నువ్ చెబుతున్న రుణం పెరిగిపోతూనే ఉంటుంది కానీ, ఎలా తీరుతుంది?''

''ఇక్కడే ఉండిపోయి ప్రయత్నిస్తే, సరైన ఉద్యోగం

## దేవుడున్నాడు

ఔను నేను నమ్ముతున్నాను!
దేవుడున్నాడు... ఆదీ ప్రాణాలతో!!
రోజా కనులారా చూస్తున్నాను కూడా!!!
పడితె వచ్చి చూసే తల్లిలో
ఆకలివాడికి ముద్దనిచ్చే దానుల్లో
కరుణతో అనాథలను చేరదీసేవాళ్ళల్లో
కనికరించి, భద్రతనిచ్చి, వృద్ధులను రక్షించెవాళ్ళల్లోజి
ఏం తోచనప్పుడు ధైర్యమిచ్చి ముందడుగు వేయించేవాళ్ళల్లో
చిక్కుల్లో ఆకస్మికంగా వచ్చి చేయూతనిచ్చేవాళ్ళల్లో
ఉభయసంకట పరిస్థితి నుంచి తప్పించేవాళ్ళల్లో
ప్రాణాపాయం నుంచి కాపాడేవాళ్ళల్లో
కష్టపరిస్థితిలో బాసటగా నిలిచేవాళ్ళల్లో
దుర్మార్గులను చితక్కొట్టే వాళ్ళల్లో
అన్యాయం-అధర్మం-అవినీతుల మధ్య మానవీయత మెరిసెవాళ్ళల్లో
దౌర్జన్యం-అఘాయిత్యం-అరాజకతల మధ్య ప్రామాణికత చూపేవాళ్ళల్లో
మూగప్రాణులకోసం స్పందించేవాళ్ళల్లో
అంగవైకల్యంతో కొట్టుమిట్టాడెవాళ్ళకోసం తల్లడిల్లి పోయేవాళ్ళల్లో
అపరాధిస్థానంలో వున్నప్పుడు సమర్థన చేసేవాళ్ళల్లో
అంధకారం నుంచి వెలుగులోకి తెచ్చేవాళ్ళల్లో
నేను మాత్రం దేవుణ్ణి మనుషుల్లోనే చూస్తూ వస్తున్నాను
మీకు తెలుసా...
సంధిగ్ధ పరిస్థితిలో చేయూతనిస్తే
''దేవుడిలా వచ్చావ్'' అని మీరు ఉద్గారం తీస్తే
దానర్థం ఇంతే-
మూర్తి రూపంలో కాదు దేవుడున్నది
జీవితంగా నరరూపంలోనే
ఉండీ ఉండనట్టు మనుషుల్లోనే వున్నాడు
మీరే కనుక్కోవచ్చు అంతర్నేత్రువుంటే!!!

- సోమ సురేశ్

రాకపోతుందా?''

''అది సరేరా! ఉద్యోగాలు ఇక్కడ దొరక్కనే కదా, ఆ దేశం, ఈ దేశం వెళ్ళిపోతున్నారు. ఇక్కడే వస్తే, అంత కంటే కావాల్సిందేముంటుంది?!రాకపోతే ఏం చేయాలి? అదే సమస్య! మీ అన్నయ్య ఇక్కడ చేయని ప్రయత్న మంటూ ఏదీలేదు! ఇక్కడ దొరకలేదు! అమెరికా వెళ్ళి పోయాడు! అదే జరిగింది!''

''సంకల్పమంటూ ఉంటే, మనం రుణం తీర్చేయ డమే కాకుండా, ప్రజాధనమే మనకి రుణపడేలా మనం చేసుకోగలం. ఎన్నో మార్గాలున్నాయ్. ఇక్కడే ఉండిపో! రుణం తీర్చేసుకో!''

''ఉద్యోగం లేకుండా, బతకడమెలా?''

''అత్తగారు చెప్పినట్లు, సమస్య అక్కడే వస్తుంది! ప్రజాధనానికి న్యాయం చేయడం, రుణం తీర్చుకోవ డంపై మనకి ముందుగా స్పష్టమైన అవగాహన కావాలి. ఇక్కడున్న పరిస్థితి ఏంటి? అవసరాలకు మించిన మానవ వనరులు మనకున్నాయి. మన ఆర్థిక వ్యవస్థ అందరికీ ఉద్యోగాలూ, ఉపాధి కల్పించగలిగే స్థాయికి ఎదగలేదు. అందువల్ల, మన అవసరాలు తీరగా మిగిలిన మానవ వనరుల్ని ఎక్కడ ఉపయోగించినా, అది మనకు మంచిదే! మన ఆర్థిక వ్యవస్థకు మంచిదే! నిరుద్యోగ భారం తగ్గుతుంది.

## నవ్వులాట

**నా**డు నవ్వు నాలుగు విధాల చేటు
నేడు నవ్వు నలభై విధాల మేలని
వైద్యులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు
నవ్వుల్లోనూ రకరకాలు
పాలలా స్వచ్ఛమైన పసిపాప బోసినవ్వు
పాడ్యమి చంద్రునిలా ప్రౌఢ చిరునవ్వు
మేడిపండులాంటి కుళ్ళు నవ్వు
బలవంతపు నవ్వు, తెచ్చిపెట్టుకున్న నవ్వు
వెక్కిరింపు నవ్వు, విషపునవ్వు
కొంటెనవ్వు, చిలిపి నవ్వు
మందహాసం, దరహాసం
గలగలా పారే సెలయేటి నవ్వు
అబ్బో!
ఈ నవ్వులపై ఓ కావ్యమే రాయొచ్చు
అయితే
నేడు మన జీవితంలో
నవ్వు ఎండ మావైంది
ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచంలో
బతకడానికి ఆరాటం, ఉనికికై పోరాటం
ఒత్తిళ్ళ బరువుతో మనం నవ్వడం మరిచాం
బాల్యం నుంచే ఎమ్సెట్ బూచి చూపి
పసిపిల్లలను కూడా నవ్వులకు దూరం చేస్తున్నాం
అందుకే జబ్బుల బారిన పడుతున్నాం
గడియారంతో పోటీపడే మన
దైనందిన కార్యక్రమాల్లో
నవ్వుకెలాగూ చోటులేదని
నవ్వుల సంఘాలు, అవేనండీ
లాఫింగ్ క్లబ్‌లు వెలిసాయి
ఆ నెపంతోనైనా రోజూ ఓ అరగంట
హాయిగా నవ్వే అవకాశం కల్పిస్తున్నాయి
నవ్వు యోగాతో మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి
సహజమైన నవ్వైనా, బలవంతపు నవ్వైనా
మన మొహంలోని ఇరవైరెండు కండరాలకు
వ్యాయామం కూరుస్తుందని
శాస్త్రజ్ఞులు నిరూపించారు.
నలుగురి పని ఒక్కళ్ళతో చేయించే మల్టీనేషనల్
కంపెనీలు ఉద్యోగుల్లో
ఓవైపు ఒత్తిడిని పెంచుతూ
మరోవైపు నిపుణులకు దండి ఫీజులు
చెల్లించి స్ట్రెస్ రిలీవింగ్ లాఫింగ్
థెరపీ ఇప్పిస్తున్నాయి.
మనకా బెడద లేకుండా మనసారా
నవ్వుకుందాం. పిల్లలతో కేరింతలు కొడదాం
వీలు చూసుకుని నవ్వుల సంఘంలో చేరుదాం
నేనిది నవ్వులాటకు కాదు
సీరియస్‌గానే మనవి
చేస్తున్నాను సుమా!

అంబల్ల జనార్ధన్

అక్కడెక్కడో సంపాదించిన డబ్బులో మిగిలింది మన దేశానికి వస్తుంది. వాళ్ళ కుటుంబాలకు కాస్త డబ్బు ఇబ్బంది తగ్గుతుంది. విదేశీ ద్రవ్యం చేకూరుతుంది. ఇదంతా లాభమే కదా! ఇంకా అనుభవజ్ఞాన రూపంలో, శాస్త్ర సాంకేతిక జ్ఞానరూపంలో ఎంతో ప్రయోజనం సమకూరుతుంది. ఇందులో నష్టం ఏమీలేదు కదా! ఇదంతా లాభమే కదా! నువ్ అమెరికాకు వెళ్ళిపోయా వనుకో! ఏం జరుగుతుంది? నీకు ఇక్కడ దొరికే ఉద్యోగంలోకి మరో నిరుద్యోగి చేరతాడు! ఎందుకంటే, అవసరాలకు మించిన మానవ వనరులు మనకున్నాయి కాబట్టి! అవసరాలకు చాలని మానవవనరులుంటే, అప్పుడే నువ్ చెప్పిన ప్రజాధనానికి న్యాయం చేయడం, రుణం తీర్చుకోవడం వంటి సమస్యలు వస్తాయి! ఆ సమస్య మనకి లేదు. ఉండదు కూడా. ఇప్పుడు చెప్పు, నీ ఉద్దేశం ఏంటి?''

''వదినా, నువ్ చెప్పింది నిజమే. ఆ దిశలో ఆలో చించాల్సిన అవసరం ఉంది''

''అంతే కాదు, శోధనా! మరో విషయాన్ని కూడ చూడు. మానవ వనరులకు మించిన ఆస్తి మరోటి లేదు. మానవ వనరులులేందే, ఏ ఆస్తీ ఏదీ కూడా అభివృద్ధి కాదు. ఉన్న స్థితిలోనే ఉండిపోతుంది. ఏ దేశంలోని మానవ వనరులు పూర్తిస్థాయిలో ఎక్కడ వినియోగం జరిగినా, అది పూర్తిస్థాయిని చేరుకోగలిగే ఆర్థికాభివృద్ధి వైపు వెళుతుంది. అంతేకాదు, అక్కడ మంచి సమాజం ఏర్పడుతుంది. అవసరాలకు మించి ఉన్న మానవవన రులు నిరుపయోగంగా పడివుంటే, అంటే ఉద్యోగం, ఉపాధి, పనిలేకుండా ఉంటే- అంటే శ్రమ ఆధారంగా జీవించే అవకాశాలు లేకపోతే- అక్కణ్నుంచే నేరవ్యవస్థ బయలుదేరుతుంది. సమాంతర నేరవ్యవస్థ ఏర్పడు తుంది. అది కాలక్రమంలో వ్యవస్థ అంతటా వ్యాపించి, వ్యవస్థీకృతమైపోతుంది.

చేతినిండా పనిలేని మానవవనరులు దేశానికి లోపలి శత్రువులంటారు! దానికి కారణం వాళ్ళు కాదు! వ్యవస్థే! ఇప్పుడు మన వ్యవస్థలో అదే జరుగుతోంది! ఎవరు ఎక్క డికిపోయి శ్రమ ఆధారంగా జీవించినా, అది అందరికీ అన్ని విధాలా మంచిదే! ఇదీ నా అభిప్రాయం. ఏమం టావ్?''

''నువ్ చెప్పింది నిజమే, వదినా! అయితే, తలిదం డ్రుల మాటేంటి? పిల్లలుండి కూడా, లేని వాళ్ళల్లా వృ ద్ధాప్యాన్ని గడపడమేనా? ప్రేమలూ-ఆప్యాయతలూ- అనుబంధాలూ-వీటి మాటేంటి? అది కూడా ఆలోచిం

## నానీలు

సత్యం
ధర్మం
ఆనాడు
పదవి
పరపతి
ఈనాడు
గతం
తొంగిచూస్తుంది
మనిషిని
కుంగతీస్తుంది
ప్రభుత్వం
ప్రకటించే
రుణాలు, రాయితీలు
అధికారులు
పంచుకునే
తాయిలాలు
ఆడోళ్ళకు
చీరెలు-సారెలు
మగోళ్ళకు
సారాలు-విస్కీలు
ఓట్లకు వేసే గాలాలు
మాతృత్వమన్నది
బహుకష్టం
అయినా మగువకు
అమ్మకావటమె ఇష్టం
శిథిలమవుతున్న
మానవతకు
నిలువెత్తు సాక్ష్యం
నేటి నేతల తీరు

కె.సుధారాణి

చాలి కదా!''

''ఒరేయ్, శోధనా! నువ్ మరో విషయాన్ని మరచిపో కూడదురా! మీరు పెద్ద చదువులు చదువుకోవాలనీ, పెద్ద ఉద్యోగాలు చేయాలనీ, విదేశాల్లో కూడా పనిచేసి డబ్బుతోపాటు పేరుప్రతిష్ఠలు సంపాదించుకోవాలనీ, మీలో ఆశలు కల్పించాంది మేమే కదా! తలిదండ్రులే కదా! మా ఆశలకు అనుగుణంగా మిమ్మల్ని పెంచాం.

వాటిని మీరు ఎంతో కష్టపడి చదివి నిజాలు చేశారు. ఇప్పుడు మాకోసం అవన్నీ ఒదిలేయమంటే, మీ లక్ష్యాలనూ జీవితాలనూ విధ్వంసం చేయడమే అవుతుంది! అది ద్రోహమే అవుతుంది! అది మాకు మేం చేసుకున్న ద్రోహమే అవుతుంది! అంత స్వార్థం మాకుండకూడదు! ఎన్నో ఏళ్ళు మేమూ మీరూ పడ్డ శ్రమ బూడిదలో పోసినట్లే అవుతుంది! ఎందుకురా, అలాంటి ఆలోచన నీకు?! జీవితాంతం మేం దుఃఖంలో కుమిలి చావాలనా?!''

''ఎందుకంతలా ఆవేశపడిపోతున్నావ్? ఆవేశపడొద్దమ్మా! నువ్ చెప్పినట్లే చేస్తాను, సరేనా!''

''మేం పదేళ్ళ నుంచి దూరంగా ఉంటున్నాం. ఆప్యాయతలు, ప్రేమలూ, అనుబంధాలూ ఎక్కడికైనా పోయాయా? మనం ఉంచుకుంటే ఉంటాయ్. పెంచుకుంటే బలపడతాయ్. నిజం చెప్పాలంటే, మన విషయంలో బలపడ్డాయనే అనుకుంటా. ఇంట్లో కలిసి కూర్చుని మాట్లాడుకుంటున్నట్లే, ఫోన్లలో, కంప్యూటర్లలో, టీవీల్లో మాట్లాడుకుంటున్నాం. సంవత్సరానికొకసారైనా వచ్చి, నెల్లాళ్ళపాటు కలిసివుంటున్నాం. అవసరమైతే, కొన్ని గంటల్లోనే ఇక్కడికి రాగలిగే విమాన సదుపాయాలున్నాయ్.

ఇప్పుడు దూరం కాలంలోకి, కాలమానంలోకి మారిపోయింది! అంతకీ అవసరమైతే, మేమే ఇండియా వచ్చేస్తాం! పదేళ్ళు పై దేశాల్లో ఉన్నాం కదా! ఎవరికోసం నువ్ నీ అమెరికా ఉద్యోగం వదిలేసు కోనవసరంలేదు! అత్తగారి మాటల్ని నువ్ అర్థంచేసుకున్నావు కదా!''

## రెండు రెక్కలు

మనిషి
ఇప్పుడు
సమూహాల
ఒడ్డున వున్నాడు....,
ఉగ్రవాదం
ఒక ప్రమాదాల పెనుతుఫాన్...
నగరాల
నయాగరాల్లో
సన్నిహిత
స్నేహితుడు కరువు
ఎఫ్ఎమ్ రేడియో
పలకరింపుల పులకరింత...

పెరుగు రామకృష్ణ

## ప్రజాస్వామ్యం!

ప్రజాస్వామ్యంలో
ఓటర్లకి
భద్రత వుండదు!
ఓట్ల పెట్టెలకి
రక్షణ వుంటుంది!!

తాజీ ప్రసాద్

''నిజం చెప్పనా వదినా! నాకు ఇండియాలో కూడా మంచి ఉద్యోగం వచ్చింది''

''అలా చెప్పవేం! ఎందుకా దాపరికం?! అంత రహస్యమా?!''

''ఇక్కడ ఉద్యోగంలోనే చేరాలని నిశ్చయించుకున్నా''

''ప్రజాధనం రుణం తీర్చుకోడానికా?''

''కాదు!''

''తలిదండ్రుల కోసమా?''

''కాదు!''

''మన సంస్కృతి కోసమా?''

''కాదు! అదంటే ఏంటో నాకు నిజానికి తెలీదు! పది మాటలు మాట్లాడితే, మూడో నాలుగో ఇంగ్లీషు మాటలు లేకుండా మాట్లాడలేను! నాకు సంస్కృతి గురించి మాట్లాడే అర్హతేలేదు!''

''మరెందుకోసం?''

''ఏది ఎక్కువ జీతం? అమెరికా జీతమా? ఇండియా జీతమా? ఖర్చులుపోగా, ఎక్కడ ఎక్కువ మిగులుతుందో, అదే ఎక్కువ జీతం! ఇప్పుడు కొలమానం అదే! ఇండియా జీతమే ఎక్కువ! అందువల్ల, ఇక్కడే ఉండిపోతా. అమెరికాలో ఆర్థికస్థితి కూడా అంత బాగోలేదు కదా!''

''ఓహో! శోధనా! నన్ను ఆటపట్టించావన్నమాట!''

''కాదు కాదు, వదినా! ఎంతమాత్రం కాదు! నీతో చర్చించడంవల్లే, ఈ నిర్ణయం తీసుకోగలిగాను!''

''ఆహా! శోధనా! దొరక్కపోతావా?! ఆటపట్టించనా!!''

ఒరేయ్, శోధనా! చాలా సంతోషం! అంతకంటే కావాల్సిందేముంది! మీ వదిన చెప్పిన విషయాలు చాలా విలువైనవి మనం ఇలా నిలదొక్కుకున్నామంటే, నీ చదువు అలా బాగా సాగిందంటే, మీ అన్నయ్య వదినలు ప్రేమాభిమానాలే కారణం. అది మనం మరచిపోకూడదు'' ■